# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 132
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఫిబ్రవరి 14, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




6లో..

## అందరివాడు.. డాక్టర్ అప్పాల సుధాకర్

- నవతరానికి ఆయన స్ఫూర్తి
- యువ వైద్యులకు మార్గదర్శి
- అప్పాల ప్రతిభ అసమాన్యం
- వరించిన ఎన్నో పురస్కారాలు




# ఆకేరులో.. ఆగని దందా

- విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు బేఖాతరు
- డంపులవైపు చూసేందుకే జంకుతున్న అధికారులు
- పోలీసుల తీరు పట్ల ప్రజల ఆగ్రహం



2లో..

ఆకేరు వాగులో ఇసుక మాఫియా తిష్ట వేసింది. ప్రజా ప్రతినిధులు, అధికారుల అండదండలతో రెచ్చిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలంటూ స్థానిక కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అక్రమార్కులు మాత్రం యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇసుక డంపులవైపు చూసేందుకే అధికారులు జంకుతున్నట్లు ప్రచారం సాగుతోంది. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసుల తీరును స్థానికులు తప్పుబడుతున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవడానికి వచ్చిన అధికారులు, పోలీసులపై ఇసుక మాఫియా దాడులు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే నిజంగానే ఇసుక మాఫియాను అధికారులు, పోలీసులు అరికట్టలేకపోతున్నారా లేక మామూళ్ల మత్తులో కావాలనే వారు వెనుకడుగు వేస్తున్నారా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పర్వతగిరి మండలంలోని రోళ్లకల్, చెరువుముందు తండా, నారాయణపురం, కల్లెడ గ్రామాల్లోని పలువురు ఇసుక అక్రమ రవాణే వ్యాపకంగా పనిచేస్తున్నారంటే ఈ దందా ఎంత దర్జాగా సాగుతుందో అర్థమవుతోంది.

- వరంగల్ వాయిస్, పర్వతగిరి

## సమన్వయంతో జాతర విజయవంతం

8లో..

- జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్
- 5లక్షలకు పైగా తరలి వచ్చిన భక్తులు



## మానసిక ఒత్తిడిని అధిగమించండి

సమస్యలుంటే స్నేహితులకు చెప్పండి
వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



2లో..


## తెలంగాణ కోసమే పునర్విభజన చట్టం

నిర్మలా సీతారామన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు
మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

8లో..




## పారువేటకు శ్రీనివాసుడు



రాయపర్తి మండలంలోని సన్నూరు గ్రామంలో స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి అధ్యయన, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం స్వామి వారిని అశ్వవాహనంపై గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ క్రమంలో గ్రామస్తులు మంగళహారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. డిజె సౌండ్స్, సన్నాయి వాయిద్యాలతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, ప్రత్యేక అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

-వరంగల్ వాయిస్, తొర్రూరు

# ఆకేరులో ఆగని దందా



- విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు బేఖాతరు
- డంపులవైపు చూసేందుకే జంకుతున్న అధికారుల
- పోలీసుల తీరు పట్ల ప్రజల ఆగ్రహం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఆకేరు వాగులో ఇసుక అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా సాగుతోంది. పర్వతగిరి మండలంలోని రోళ్లకల్, చెరువుముందు తండా, నారాయణపురం, కల్లెడ గ్రామాల్లోని పలు ప్రాంతాలు అక్రమ ఇసుకకు కేరాఫ్ అడ్రస్ లుగా మారాయి. హనుమకొండ, వరంగల్ పట్టణాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు నిత్యం ఇక్కడినుంచి వందల ట్రాక్టర్లలో ఇసుక రవాణా అవుతోంది. పోలీసులు, ఉన్నతాధికారులు తనిఖీలు చేసిన సమయంలో రెండు, మూడు రోజులు బ్రేక్ ఇచ్చి తిరిగి తమ దందాను యథాతదంగా కానసాగిస్తున్నారు. అయితే అక్రమంగా ఇసుక రవాణాలో పోలీసులకు, అధికారులను నెల వారీ మామూళ్లు అందుతున్నందునే వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

**ప్రభుత్వం సీరియస్..**

ఇసుక అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అడ్డూ, అదుపూ లేకుండా సాగుతున్న దందాపై సీరియస్ అయింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలంటూ సూచించారు. అయితే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఈ ఆదేశాలతో తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం వివాదాలకు కారణంగా మారుతోంది. నిత్యం వందల ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా అవుతున్నా తమకేమీ సంబంధం లేనట్లుగా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

**యథేచ్ఛగా రవాణా..**

పర్వతగిరి మండలంలోని రోళ్లకల్, చేరువుముందు తండా, నారాయణపురం, కల్లెడ గ్రామాల్లోని కొందరు ఇసుక అక్రమదారులు ప్రభుత్వ నిబంధనలతో తమకెలాంటి సంబంధం లేదన్నట్లుగా ఇసుక అక్రమ రవాణాను యధావిధిగా కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికి స్థానిక రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు తమకేమీ పట్టణట్లు వ్యవహరిస్తున్నారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను సైతం అధికారులు పెడచెవిన పెట్టడం స్థానికంగా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇసుక అక్రమ దారులు పెద్ద పెద్ద ఎస్కవేటర్లను వినియోగించి ఇసుకను తొడుతూ పక్క మండలాలకు సైతం అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారు.

**అడుగంటుతున్న జలాలు..**

ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో స్థానికులకు, వ్యవసాయానికి చాలినంత నీటి లభ్యతలు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. తాగేందుకు నీటి లభ్యత కూడా కష్టంగానే మారుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు అధికారులకు తెలియదా..? తెలిసే అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారా..? అని ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై దాడి చేయాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న వాహనాలు సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలంటున్నారు. అప్పుడే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందంటున్నారు.

**సీపీ ఆదేశాలతో..**

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ అక్రమంగా ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ జిల్లాల్లో ఎస్పీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సీరియస్ వార్నింగ్ లు ఇస్తున్నారు. పోలీసుల కదలికలతో ఇసుక ట్రాక్టర్లు గప్ చుప్ అయ్యాయి. ఎస్కవేటర్లు కనిపించకుండా పోయాయి. అయితే ఇదే సీరియస్ నెస్ ఎప్పటికీ ఉంటుందా.. లేక రెండు మూడు రోజులకే తుస్సుమంటుందా వేచి చూడాలి.











**కఠిన చర్యలు : - అంబర్ కిషోర్ ఝా, పోలీస్ కమిషనర్, వరంగల్**

ఎవరైనా అక్రమంగా ఇసుక రావణాకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను అదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపెందుకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు సన్నద్ధమాయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ సీపీ వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామ శివారులోని ఇసుక ర్యాంపులను ఇటీవల పరిశీలించారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# మానసిక ఒత్తిడిని అధిగమించండి

- సమస్యలుంటే స్నేహితులకు చెప్పండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** విధి నిర్వహణలో అయినా ఏదైనా వ్యక్తిగత సమస్యతోనైనా ఒత్తిడికి గురైతే తమ శ్రేయోభిలాషులు, స్నేహితులతో పంచుకోవాలని, అప్పుడే మానసిక ఒత్తిడినుంచి బయట పడతామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మానసిక ఒత్తిళ్లను నియంత్రించడం ఎలా అనే అంశంపై శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లోని రుద్రమదేవి ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు పరిపాలన విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ సదస్సుకు సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. అయితే క్రమ శిక్షణ, ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించడం ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసి ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమన్నారు. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజు వ్యాయామం, యోగా చేయాలన్నారు. మీ భావాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడంతో పాటు, ఆరోగ్యానికి హానీ కలిగించే అలవాట్లకు దూరంగా ఉండాలని సీపీ సూచించారు. అంతకుముందుగా నగరానికి చెందిన మనస్తత్వవేత్తలు డా.జ్యోతి, స్వప్న, బెన్‌సన్‌లు మానసిక ఒత్తిళ్లను అదిగమించేందుకు చేయాల్సిన చిట్కాలను వివరించారు.ఈ కార్యక్రమములో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, అదనపు డీసీపీలు రవి,



సురేష్ కుమార్, ఏసీపీలు జితేందర్, మధసూధన్, నాగయ్య, అనంతయ్య, ఏఓ రామకృష్ణతో పాటు ఆర్‌ఐలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్‌ఎస్‌ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శుక్రవారం, ఫిబ్రవరి 14, 2025

# కబ్జా భూములను స్వాధీనం చేసుకుంటాం

## ■ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో మాజీ ఎమ్మెల్యే కబ్జా చేసిన 34 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ స్పష్టం చేశారు. మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలో నూతనంగా నిర్మించే హార్టికల్చర్ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల భవనం వేరే ప్రాంతానికి తరలిపోతుందని అసత్య ఆరోపణలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొంది గ్రామ ప్రజల్లో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే కుట్రలను తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సర్వే నెంబర్ 551లో 34 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసి తప్పుడు ధృవ పత్రాలు సృష్టించి కుటుంబ సభ్యులపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఆ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. చింత చచ్చినా పులుపు చావని చందంగా కబ్జా చేసిన భూములను కాపాడుకునేందుకు మాజీ ఎమ్మెల్యే కొత్త నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ఉద్యాన పరిశోధనా కేంద్రంగా ప్రసిద్ధి చెందిన మల్యాలలోనే ఉద్యాన వన డిగ్రీ కళాశాల భవన నిర్మాణం చేపట్టడమే కాకుండా స్థానికులకే ఉద్యోగ అవకాశాలలో పెద్దపీట వేస్తామన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మందిర భూమి తనదంటూ మాజీ ఎమ్మెల్యే ప్రగల్భాలు పలుకుతున్నాడని ఆరోపించారు. ఆ భూములపై ప్రతి గిరిజనుడికి హక్కు ఉందని, ఆ భూములను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ట్రస్ట్ పేరిట ఆలయ నిర్మాణం చేపడతామన్నారు. ఈ నెల 15న నిర్వహించే శ్రీ సంతు సేవాలాల్ జయంతిని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్రిక్తతల నడుమ రహదారి సర్వే



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఉద్రిక్తతల నడుమ భారీ పోలీస్ బందోబస్తుతో ఎన్ హెచ్ పి-930 వలిగొండ.. భద్రాచలం జాతీయ రహదారికి సర్వే నిర్వహించారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్ర శివారు సాలార్ తండాలో జీవనోపాధి పొందుతున్న పంటపొలాల్లో నుంచి వెళ్తున్న వలిగొండ-భద్రాచలం జాతీయ రహదారి పి-930 అలైన్ మెంట్ మార్చాలంటూ గత కొద్ది రోజులుగా భూ నిర్వాసితులు సర్వే అధికారులను అడ్డుకొని ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం ఉదయమే వందలాదిమంది పోలీసులు , రెవెన్యూ , నేషనల్ హైవే అధికారులు సలార్ తండాకు చేరుకొని భూనిర్వాసిత గిరిజన రైతులను అదుపులోకి తీసుకొని కురవి పోలీస్ స్టేషన్ కు తరలించారు. గిరిజన రైతులు బలవంతంగా భూములను లాక్కోవద్దంటూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భూ నిర్వాసిత రైతు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే ల భూములు పోతున్నాయంటూ గతంలో రెండు సార్లు అలైన్ మెంట్ ను మార్చారని, తండా మధ్యలో నుంచి ఎన్ హెచ్ పోవడంతో గిరిజన రైతుల భూములు పోతున్నాయని, ఎన్నికల ముందు సమస్యను పరిష్కరిస్తామని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ లు హామీ ఇవ్వడంతో ఓట్లు వేసి గెలిపించామన్నారు. తీరా ఇప్పుడు వారి హామీని నిలబెట్టుకోలేదని, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు విజ్ఞాపన పత్రాలు అందించామని ఎవరూ మాసమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన భూములను బలవంతంగా గుంజుకోవద్దని గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం జాతీయ రహదారి నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ జాతీయ రహదారి అలైన్ మెంట్ మార్చాలని గిరిజన రైతులు వేడుకుంటున్నారు.

# ఎమ్మెల్యే నాగరాజును కలిసిన మహేష్



**వరంగల్ వాయిస్, సుబేదారి :** నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ జన్మదినం సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు హనుమకొండ సుబేదారి క్యాంప్ ఆఫీస్ లో కేఆర్ నాగరాజు కి మర్యాదపూర్వకంగా కలిశారు .అనంతరం శాలువతో మహేష్ ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనాధ పిల్లలకు వృద్ధులకు సేవ కార్యక్రమాలు చేయాలని అన్నారు. అనంతరం అడుప మహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలనుసారంగా పండ్ల పంపిణీ కార్యక్రమం సేవా కార్యక్రమాల చేయడం జరుగుతుందని అన్నారు. లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ గౌడ్ మాట్లాడుతూ బర్త్డే కేకులు కటింగ్ కాకుండా రక్తదాన శిబిరాలు సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్. ఎస్సీ సెల్ అధ్యక్షుడు పస్తం శంకర్. ఎస్సార్ నగర్ గ్రామ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్. ఎన్టీఆర్ నగర్ గ్రామ అధ్యక్షుడు. ఈర్ల రాజేందర్. ఏకామ్రాచారి. కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా అమర జవాన్ల త్యాగం మరువలేనిది



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పుల్వామలో అమరులైన వీర యోధులను స్మరిస్తూ శుక్రవారం తొర్రూరు పట్టణంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు మాట్లాడారు. 2019లో జమ్మూ నుంచి శ్రీనగర్ వెళుతున్న భారత సైనికులపై పుల్వామ వద్ద పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర మూకలు దొంగచాటుగా బాంబు దాడులకు పాల్పడి 20మంది ని పొట్టన పెట్టుకున్నారని, పుల్వామ అమర జవాన్ల త్యాగం మరువలేనిదని, వారి ఆత్మలకు శాంతి చేకూరేలా ప్రతీ భారతీయుడు నేడు వారికి నివాళులు అర్పించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ పుల్వామ దాడికి పాల్పడిన ఉగ్ర మూకలను సర్జికల్ స్ట్రైక్స్ చేసి అంతమొందించి ప్రతీకారం తీర్చుకున్నాడని, దాయాదులు మరోసారి భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చావుదెబ్బ తీశాడని, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా దేశ భద్రత కోసం రాజీ లేని నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. దేశం కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా బలిదానం చేసిన అమర జవాన్ల కుటుంబాలకు దేశం యావత్తూ అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కుమార్, తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు గట్టు రాంబాబు, జిల్లా, మండల నాయకులు ఎనగందుల శ్రవణ్, అలిసెరి రవిబాబు, మంగళపల్లి యాకయ్య, గడల శేఖర్, గట్ల భరత్, జలగం రవి, దేవరకొండ విష్ణు, నూకల నవీన్, శీలం శ్రీనాథ్,గంధం రాజు, కుమ్మరికుంట్ల శివ, తాటి జగదీష్, నడిగడ్డ సందీప్, పప్పు శెట్టి సంతోష్, నర్కుటి చలపతి రాజ్, ధరావత్ తేజస్, రాజశేఖర్, సందీప్, శ్రీనివాస్, సుధాకర్, శ్రీకాంత్, మచ్చ ఉదయ్, కక్కెర్ల సురేష్ పాల్గొన్నారు.

# గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీపీయూఎస్ మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ ను రద్దు చేస్తామని హామీనిచ్చారని, 14 నెలలు గడిచినా ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఢిల్లీలో బీజేపీ విజయానికి దోహదపడ్డాయని, ప్రభుత్వాలు మారుతున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర జిల్లా నేతలు పాల్గొన్నారు.

# గాంధీ భవన్ తరలిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గ శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ సమన్వ కమిటీ సభ్యులు హైదరాబాద్ తరలి వెళ్లారు. గాంధీ భవన్ లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేసే విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనడానికి హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోడెపాక కర్ణాకర్, పాడి ప్రతాప్ రెడ్డి, పర్నెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మలహాల్ రావు, గోల్కొండ సదానందం, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, పర్నెం తిరుపతిరెడ్డి, బొల్లె భిక్షపతి, పెద్ద బోయిన రవీందర్ యాదవ్, కోడెపాక ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం గ్రామానికి చెందిన బూత్ ఉపాధ్యక్షులు బింగి అన్వేష్ అమ్మ బింగి వీరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకొని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్. పగడాల కాళీ ప్రసాద్ రావు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, బీజేపీ నాయకులు సలెంద్ర భాస్కర్, మామిడి భిక్షపతి, కంచ శ్రీకాంత్, తిరుపతి, బింగి భిక్షపతి, ఇప్ప రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు..

# 17న సీజ్ చేసిన అక్రమ ఇసుక వేలం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో శుక్రవారం సీజ్ చేసిన అక్రమ ఇసుకను ఈ నెల 17న వేలం వేయనున్నట్లు తాసిల్దార్ సత్యనారాయణ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్నవారు వేలంపాటలో పాల్గొని ఇసుకను పొందాలని ఆయన కోరారు.

# ఉచితాలపై వాఖ్యలు బాధాకరం

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రైతు కూలీలు, అసంఘటితరంగ కార్మికులు, చేతివృత్తుల వారికి, పేదలకు ప్రభుత్వాలు ఇస్తున్న ఉచిత పథకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం అత్యంత బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. పేదలకుఉపాధికల్పించలేక, కల్పించిన కష్టానికి తగిన కూలి లభించక, మరోవైపు పాలకుల విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు అంతులేకుండా పెరిగి పేదలు దుర్భర జీవితాలు గడుపుతుంటే వారికి ఎంతో కొంత ఉపశమనం కలిగించే విధంగా పాలకులు కొన్ని ఉచిత పథకాలు ప్రవేశపెడితే దానికి వ్యతిరేకంగా న్యాయమూర్తులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఉచిత పథకాల వలన పేదలు సోమరిపోతులుగా తయారవుతున్నారని, వ్యవసాయ పనులకు వారు రావడం లేదని చెప్పడం ఏ మాత్రం సరైనది కాదన్నారు. కష్టపడి దేశ సంపదను ఉత్పత్తి చేసిన శ్రమజీవులకు ఆ సంపదలో న్యాయమైన వాటా లభించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచనలు చేయని వీరు పేదలకు ఉచిత పథకాలకు వ్యతిరేకంగా మాట్లాడడం సమాజ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు వేలాది కోట్ల రూపాయల రాయితీలను పాలకులు అందజేస్తుంటే వాటిపై స్పందించని న్యాయమూర్తులు అర్హత కలిగిన పేదలకు ఇస్తున్న ఉచిత పథకాలపై మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఉచిత పథకాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారు ఎవరైనా తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు, సామాన్య ప్రజలకు సామాజిక న్యాయం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# నగరంపల్లి తండాలో మంచినీటి ఎద్దడి

**వరంగల్ వాయిస్, గణపురం :** నగరంపల్లి తండాలో ఎంతోకాలంగా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొని తాము దాహంతో అల్లాడిపోతున్న గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పట్టించుకోవడంలేదని శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేసినట్లు తండావాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే తమ తండాలో నెలకొన్న మంచినీటి ఎద్దడిని నివారించకపోతే తాము పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై నిర్ణయం హర్షనీయం

**వరంగల్ వాయిస్, గణపురం :** బీసీ రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం పెడతామని రేవంత్ సర్కార్ ప్రకటించడంపై జిల్లా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. పలువురు బీసీ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16నుంచి 28 వరకు మరోసారి కులగనన సర్వే అవకాశం కల్పించటం సంతోషదాయకమని బి.శివశంకర్ గౌడ్ ఆనందం వ్యక్తం చేశారు

# ఘనంగా ఝాన్సీ రాణి-రవీందర్ వివాహ దినోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కమలాపూర్ మండలం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి–రవీందర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను అఖిలభారత పద్మశాలి హనుమకొండ జిల్లా కమిటీ ఘనంగా నిర్వహించింది. హనుమకొండలోని చైర్మన్ ఝాన్సీ రాణి–రవీందర్ నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఝాన్సీ రాణి–రవీందర్ దంపతుల 33వ వివాహ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా చేపట్టి పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, కమలాపూర్ మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ అమరేష్, తవుటం ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

# అప్పుల పాలయ్యాం.. ఆత్మహత్యే శరణ్యాం


## ▪ వాటర్ ట్యాంక్ ఎక్కిన మాజీ సర్పంచి





**వరంగల వాయిస్, నడికూడ :** నడికూడ గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించకపోవడంతో తన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని శుక్రవారం గ్రామ మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యే శరణ్యమని నిరసన తెలియజేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించినందుకు నిరసనగా నడికూడ గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ 2018 నుంచి 2024 వరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామపంచాయతీ భవనానికి 20 లక్షలు, మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం ఆరు లక్షలు, జీపీ ఫండ్ నుంచి ప్రధానోపాధ్యాయుల ఆఫీస్ నిర్మాణ వ్యయం రెండు లక్షల 50 వేలు, ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల నిర్మాణ వ్యయం రూ.14 లక్షలు, ఆర్ డబ్ల్యూఎస్ సప్లై కోసం సీడీపీ నిధుల నుంచి పైప్ లైన్ కోసం ఐదు లక్షలు, గ్రావెల్ ,లైటింగ్ పనుల కోసం ఎనిమిది లక్షలు మొత్తం రూ.51,50,000 అప్పు చేసి అభివృద్ధి చేసినటకలే తెలిపారు. ప్రజాసేవలో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని, అభివృద్ధి చేయడమే తప్పు అన్నట్లుగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 14 నెలలుగా రాష్ట్రంలోని సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. సర్పంచులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి సర్పంచులను రుణ విముక్తుల్ని చేయాలని, బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

# సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బంజారాలా ఆరాధ్య దైవం, 14 కోట్ల బంజారా ప్రజల ఆదర్శప్రాయుడు బంజారా జాతిని జాగృతం చేసిన వీర సూర్ బాల బ్రహ్మచారి సద్గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ తొర్రూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని కమిటీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజన నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సెలవు దినంగా ప్రకటించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఇది బంజారా ప్రజలకు తీవ్ర అసహనాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శోభాయాత్రకు సంబంధించిన ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నామని సేవాలాల్ మహారాజ్ భక్తులకు, అభిమానులకు పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. తొర్రూరు మండల వ్యాప్తంగా ఉన్న బంజారాలు పట్టణ కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ గాంధీ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీగా కొనసాగుతుందన్నారు. బంజారా జాతిలో పుట్టి వివిధ రంగాలలో పనిచేస్తున్నటువంటి వారందరూ స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జాటోత్ రమేష్, మాలోతు సురేష్ బాబు, గుగులోతు అరుణ్ కుమార్, జాటోతు యాకేందర్, బానోత్ తారక్ శ్రీను, జాటోద్ బాలాజీ, భూక్య బాలాజీ, భూక్య నవీన్, ధరావత్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుడు ఎదగడమే తప్పా?



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తమిళనాడులోని మేల్ పీడవూరు గ్రామంలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న దళితుడు అయ్య స్వామి బుల్లెట్ బండిపై కాలేజీకి రావడాన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణాలు అతడి రెండు చేతులు నరకడం దుర్మార్గమైన చర్య అని బీజేపీ ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు అన్నారు. నగరంలోని 39వ డివిజన్ దళిత బస్తీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాజు మాట్లాడతూ దళితులు ఉన్నత స్థాయిలో ఎదుగితే ఓర్వలేని అగ్రవర్ణ కులాల్లో మార్పు రావలన్నారు. అదేవిధంగా తెలంగాణలో చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని ఆరోపించారు. అయ్య స్వామి కుటుంబానికి తమిళనాడు ప్రభుత్వం సరియైన న్యాయం చేయాలని మాదాసు రాజు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అగ్రవర్ణ ఉన్మాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దళితులు తాళ్లపల్లి రాజు, కలవాల రాహుల్, ఆకారపు మహేష్, మాదాసు శ్యామ్, వస్కుల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి



**వరంగల్ వాయిస్, పరకాల :** గాంధీ భవన్ లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాట చేసిన సమావేశానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశానికి బయలుదేరారు. ఈ సందర్భంగా కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ చరిత్రలోనే ఎవరూ చేయలేని విధంగా కులగనన చేపట్టి నేడు బీసీలకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. భారతదేశంలోని ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న ఏ పార్టీ కూడా చేయలేదని, కానీ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన గంటలోనే ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. అదేవిధంగా ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి అసెంబ్లీలో బిల్లు పెట్టిన మహా నాయకుడు రేవంత్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలను అంచెలంచలుగా నెరవేరుస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేద ప్రజలు అనేక ఇబ్బందుల పాలై సంక్షేమ పథకాలు అందలేవని విమర్శించారు. కేవలం కుటుంబం దోచుకొని తిన్నారు తప్ప, రాష్ట్ర ప్రజలకు మేలు చేసింది ఏం లేదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి కెసిఆర్ సకల జనుల సర్వే అని పెట్టి ఇప్పటివరకు కూడా ఆ సర్వేను బయట పెట్టలేదు కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఎస్సీలకు మేం ఎంతో మాకు అంత అనే రిజర్వేషన్లను కేటాయిస్తే ఇప్పుడు ఓర్వలేక అవాకులు చేవాకులు మాట్లాడుతున్నారని మండిపడడ్డారు. ఈ కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ నాయకులు, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, కుంకుమేశ్వర అలయ కమిటీ చైర్మన్ కొలుగురి రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, హరి ప్రసాద్, ఎక్స్ ఎంపీపీ ఉంటేరు రామ్మూర్తి, ఎండీ రంజాన్ అలీ, మడికొండ సంపత్, ఏకు రాజు, పసుల రమేష్, బండి సదానందం, మెరుగు శ్రీశైలం, చందుపట్ల రాఘవరెడ్డి, వెంకటస్వామి, మార్కా రఘుపతి, నల్లెల అనిల్ గౌడ్, పబ్బ శ్రీనివాస్, దార్న వేణుగోపాల్ పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, ఫిబ్రవరి 14, 2025

# సమన్వయంతో సదస్సుల నిర్వహణ సాధ్యం




➲ కేయూ వీసీ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కేయూ :** "సమిష్టితత్త్వం, సమన్వయంతో పెద్ద పెద్ద జాతీయ స్థాయి సదస్సుల నిర్వహణ సాధ్యమని నిరూపించిన కాకతీయ యూనివర్సిటీ" అని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు.శుక్రవారం విశ్వవిద్యాలయ చరిత్ర, టూరిజం మేనేజ్మెంట్ విభాగం ఆచార్యులు ఆచార్య టి. మనోహర్ సారథ్యంలో నిర్వహించిన 82 వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, 49 వ ఎపిగ్రాఫికల్ సొసైటీ వార్షిక సమావేశం, 43 ప్లేస్ నేమ్స్ సొసైటీ వార్షిక సమావేశానికి సంబంధించిన దృశ్యమాలిక (ఆల్బమ్ )ను సమర్పించిన సందర్భంగా విభాగ అధ్యాపకులతో మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఎంత పెద్ద సదస్సు అయిన నిర్వహించగల మానవ వనరులు, ఇతర వనరులు విశ్వవిద్యాలయానికి ఉన్నాయని గుర్తు చేశారు. ఇటువంటి కార్యక్రమాలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో పాటు, విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్ కుమార్, డాక్టర్ ఎం.కృష్ణ సుమంత్, డాక్టర్ కే.నాగేశ్వర్ రావు, డాక్టర్ కేవీఎస్.నరేందర్, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఎ.కుమార్ పాల్గొన్నారు.

# అనాథ బాలికకు ఉచిత ఆపరేషన్

## మానవత్వం చాటుకున్న డాక్టర్ నరేష్ కుమార్





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్, వరంగల్‌లోని శ్రీ శ్రీనివాస సన్‌షైన్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వి.నరేష్ కుమార్ మరోమారు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా తిమ్మాపూర్ ప్రాంతంలోని న్యూ లైఫ్ సొసైటీలో అనాథ బాలికకు మెడ వెనుక భాగంలో కణితి ఏర్పడింది. క్రమేణా కణితి పరిమాణంతో పాటు నొప్పి కూడా పెరగడంతో మూడేండ్లుగా అవస్థ పడుతోంది. బాలిక పరిస్థితిని గమనించిన ఆశ్రమ నిర్వాహకురాలు రజని నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించగా, పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేసి కణతి తొలగించాలన్నారు. సుమారు రూ.20 వేలు అవుతుందని తెలియజేయడంతో సన్‌షైన్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వి.నరేష్ కుమార్‌ని సంప్రదించారు. బాలిక ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు రూ.20 వేల విలువైన ఆపరేషన్ ఫ్రీగా చేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత బాలిక ఆరోగ్య పరిస్థితి కుదుటపడడంతో డిశ్చార్జ్ చేశామని డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా నరేష్‌కుమార్‌కు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# 20న చలో హైదరాబాద్

## న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతోపాటు రాష్ట్రంలో ప్రజాసామిక వాతావరణం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు హనుమకొండలోని కాళోజి జంక్షన్ లో పోస్టర్ ఆవిష్కరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడో గ్యారెంటీగా ప్రజా పాలన అందిస్తామని వాగ్దానం చేసింది కానీ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలు, మేధావులు, విప్లవ సంస్థల నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వాల మాదిరిగానే బూటక ఎన్ కౌంటర్లు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ నాయకులు ఇనుముల కృష్ణ, మన్నే కరుణాకర్, పీడీఎస్ యూ నాయకులు మర్రి మహేష్, ఉడుత గణేష్, పవన్, సుమన్, శ్రీనివాస్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న ఒడిశా దంపతుల అరెస్ట్

■ 24కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు సీజ్



**వరంగల్ వాయిస్, క్రైం :** చూడటానికి వారు ఉన్నత కుటుంబాలకు చెందిన దంపతులుగా కనిపిస్తూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన కిలాడీ దంపతులను మీల్స్‌కాలనీ, డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. ఈ ఘరానా దంపతుల నుంచి సుమారు 6 లక్షల రూపాయల విలువ గల 24కిలోల గంజాయి ప్యాకేట్లతో పాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి మీల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ వెంకటరత్నం వివరాలను వెల్లడిస్తూ ఒడిషా రాష్ట్రానికి చెందిన గొగి శంకర్ దాస్ (39), పూర్ణిమ గొగిదాస్ (30) వీరూ ఇరువురు భార్యభర్తలు ప్రస్తుతం ఈ దంపతులు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో నివాసం ఉంటున్నారు. ఈ కిలాడీ దంపతులు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఈ దంపతలు గంజాయిని ఒడిషా నుంచి తీసుకవచ్చి సూరత్‌లో విక్రయించడం ద్వారా ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనుకున్నారు. దీంతో నిందితులు గతంలో ఒడిషాలో పరిచయం ఉన్న ప్రదీప్ అనే గంజాయి స్మగ్లర్ల వద్ద గంజాయిని కోనుగొలు చేసి రహస్యంగా బ్యాగుల్లో భద్రపర్చి రైలు ద్వారా ముంబాయి మీదుగా సూరత్‌కు తరలించేవారు. ఇదే తరహాలో వీరు పలుమార్లు గంజాయిని సూరత్‌కు తరలించారు. ఇదే తరహాలో నిందితులు శుక్రవారం మధ్యాహ్నం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ పోలీసులకు పట్టుబడుతామనే భయంతో నిందితులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగి మరోమార్గంలో ముంబాయి వేళ్లేందుకు మూడవ ప్లాట్‌ఫారం నుంచి బయటికి పోయేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో డ్రగ్స్ కంట్రోల్ టీంతో కల్సి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మీల్స్‌కాలనీ ఎస్ఐ సురేష్ నిందితులను అనుమానంతో అదుపులోకి తీసుకోని తనీఖీ చేశారు. వారి బ్యాగుల్లో గంజాయిని గుర్తించిన పోలీసులు దంపతులను అరెస్టు చేసిన పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ వెంకటరత్నం తెలియజేశారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేరడ మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు షీ టీం భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీం ఎస్సై సునంద విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై షీ టీం విధులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల మరియు విద్యార్థినుల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థులు గుర్తించి చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు . ఈ అవగాహన కార్యక్రమంలో మోడల్ స్కూల్ నేరెడ ప్రిన్సిపల్ వై శ్రీకాంత్, అధ్యాపక సిబ్బంది, షీ టీం సిబ్బంది అరుణ, రమేష్ భరోసా యూనిట్ రేణుక, బేబీయాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నుంచి సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో 17 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో మొత్తం 17మందిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ జి. సీతారెడ్డి వెల్లడించారు. ఈ 17 మందిని కోర్టులో హాజరుపరచగా రూ.22,100 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ రాజశేఖరరెడ్డి తీర్పునిచ్చారన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 05 మందికి రూ. 2400 జరిమానా విధించినట్లు సీఐ సీతారెడ్డి పేర్కొన్నారు.

# విద్యాశాఖకు మంత్రి ఏడీ?

## విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

## పీడీఎస్ యూ రాష్ట్ర బాధ్యులు





**వరంగల్ వాయిస్, కేయూ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర కాలం గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం మంత్రిని నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేశారని పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహరావు ఆరోపించారు. కేసిఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ బిల్డింగ్ వద్ద పీడీఎస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కంపాటి పృథ్వి, బి.నరసింహారావులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. ఒకపక్క గురుకుల విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అర కొర సౌకర్యాలు, అధ్యాపకుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ తరగతి గదులు, శిథిలావస్థలో బిల్డింగులు, అద్దె భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యా సంస్థలు సంక్షోభంలో కూరుకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు కావ్య, పి.అనూష, కేయూ కన్వీనర్ బాలు, శ్రీజ, సాధన, గణేష్, చారి, వంశీ, వినయ్, పవన్ కళ్యాణ్, గని, యాదగిరి, హరికృష్ణ, రాజశేఖర్, సాయి, నాగరాజు, వెంకటేష్, రాకేష్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



గడ్డం కేశవమూర్తి



# అందరివాడు.. డాక్టర్ అప్పాల సుధాకర్





- నవతరానికి ఆయన స్ఫూర్తి
- యువ వైద్యులకు మార్గదర్శి
- అప్పాల ప్రతిభ అసమాన్యం
- వరించిన ఎన్నో పురస్కారాలు

హానెస్ట్.. కమిట్ మెంట్ కు చక్కటి నిర్వచనం ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ అప్పాల సుధాకర్. వైద్య విద్యార్థులకు పాఠాలు బోధించినా.. థియరీలో శిక్షణ ఇచ్చినా ఆయనకాయనే సాటి. ఆయన బోధనలు వింటే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందుతాయి. ఓరుగల్లు జిల్లాలో వైద్య రంగానికి ఆయన ఆత్మ బంధువు. కాకతీయ వైద్య కళాశాలలో యువ వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పి వారిని కార్యోన్ముఖులను చేయడానికి ఎంతగానో ప్రయత్నించారు. సరిపడా బోధకులు, వసతులు లేకుంటే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందదు. ఈ పరిస్థితులను గమనించిన ఆయన గాడీ తప్పకుండా విద్యాబోధన చేశారు.

అటు కేఎంసీ..ఇటు ఎంజీఎంలో మూడు దశాబ్దాల పాటు ఉత్తమ వైద్య సేవలు అందించిన డాక్టర్ అప్పాల సుధాకర్ నవతరానికి స్ఫూర్తి. యువ వైద్యులకు మార్గదర్శి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన ప్రతి ఒక్క వైద్య విద్యార్థికి దారి చూపే దీపంలా నిలిచారు. ఆయన శిష్యులు అనేక మంది నేడు దేశ, విదేశాల్లో వైద్య రంగంలో ప్రముఖులుగా వెలుగొందుతున్నారు.

## కుటుంబ నేపథ్యం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేటకు చెందిన అప్పాల సుధాకర్ 20 ,సెప్టెంబర్ 1954లో జన్మించారు. తల్లిదండ్రులు సౌందర్య, నరసింహరామయ్య. తమ్ముడు రవీందర్ తో పాటు నలుగురు అక్కాచెల్లెలు ఉన్నారు. వ్యవసాయ కుటుంబం. 1977 మే 12న మేనమామ కూతురు ఇందిరను వివాహం చేసుకున్నారు. వీరి పెద్ద కుమారుడు రంజిత్ అమెరికాలో టయోటా కంపెనీలో సీనియర్ మేనేజర్ గా ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కుమారుడు అభిలాష్ ఎం.డీ (రేడియాలజీ) పూర్తి చేసి హైదరాబాదులో ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. అమ్మమ్మ నామాల రామక్క ప్రోత్సాహంతో ముందుకెళ్లారు. సుధాకర్ చిన్నతనం నుంచి ఏకసంతాగ్రహి. ఒక్కసారి విన్నా, చదివినా ఇట్టే నేర్చుకునే దూరదృష్టి కలవారు. విద్యార్థి దశ నుంచే ఆయనకు డాక్టర్ కావాలనే మక్కువ ఉండడంతో ఎంతో కష్టపడి చదువుకొని అది సాధించారు.

## విద్యాభ్యాసం.. ఉద్యోగ ప్రస్థానం..

అప్పాల సుధాకర్... ప్రాథమిక విద్య దమ్మన్నపేటలో, దామెర హైస్కూల్ లో పదో తరగతి చదివారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు సంవత్సరాల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా పనిచేసిన అనంతరం ఇన్ సర్వీస్ కోటాలో కాకతీయ మెడికల్ కళాశాలలో ఎం.ఎస్ (జనరల్ సర్జన్) పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ సర్వీసులో చేరిన ఆయన 1993 నుంచి 2012 వరకు వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, ఎంజీఎం ఆసుపత్రిలో వైద్య సేవలు అందించారు. ఉద్యోగ విరమణ అనంతరం 2012 నుంచి 2020 వరకు కరీంనగర్ ప్రతిమ మెడికల్ కళాశాలలో హెచ్ఓడీగా విధులు నిర్వర్తించారు. 2021లో హనుమకొండ బాలసముద్రంలో వాసవి నర్సింగ్ హోమ్ ను స్థాపించి స్వతంత్రంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ గా గుర్తింపు పొందిన సుధాకర్ ఇప్పటివరకు లక్ష పైచిలుకు ఆపరేషన్లు చేసి రికార్డు సృష్టించారు. ప్రతిష్టాత్మకమైన ఆజర హాస్పటల్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన శరణ్య, లావణ్య, మహి, శ్రీనివాస కిడ్నీసెంటర్ ఆసుపత్రులకు వెళ్లి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

## దేశం గర్వించేలా..

వైద్యరంగంలో అసమాన ప్రతిభ కలిగిన డాక్టర్ అప్పాల సుధాకర్ దేశం గర్వించేలా శిష్యులను తయారు చేశారు. సామాన్య విద్యార్థులను అసమాన్యులుగా తీర్చిదిద్దుతూ వారిని ఉత్తమ వైద్యులుగా ఎదిగేందుకు కృషి చేశారు. పేదవాడి ఉన్నతికి చదువు ఒక్కటే మార్గమని.. ఆ చదువు ద్వారానే సమాజంలో గౌరవాన్ని, ఉన్నత స్థానాన్ని పొందగలరనే నమ్మకాన్ని ఆయన పెంపొందించారు. అట్టడుగు వర్గాల్లో వికాసం విద్యతోనే సాధ్యమని చెబుతూ వైద్య విద్యార్థులను ఎవరెస్టు శిఖరమంతా ఎత్తుకు తీసుకెళ్లారు. బోధన, పరిశోధన, వ్యక్తిత్వ నైపుణ్యాల్లో విలక్షణమైన మార్పు తెచ్చేలా బోధనా అంశాల్ని వైద్య విద్యార్థులకు అందించారు. తాను నేర్చుకున్న వైద్య విద్యను తన వరకే పరిమితం కాకూడదని వేలాదిమంది శిష్యులకు ఉత్తమ బోధనను అందించి అందరితో ప్రశంసలు పొందారు. అందుకే మా మాస్టారు మనసున్న మారాజు అని ఆయన శిష్యులు సంబోధిస్తారు. డాక్టర్ సుధాకర్ సార్ వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామంటారు. దేశ ,విదేశాల్లో ఉన్న ఆయన శిష్యులంతా ఆయనను ఆరాధ్య అధ్యాపకుడిగా ఆరాధిస్తారు.




## యువ వైద్యులకు మార్గదర్శి..

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించే మెడికోలకు విద్యా బుద్ధులు నేర్పిన డాక్టర్ అప్పాల సుధాకర్.. మీ కాళ్లపై మీరు నిలబడండి అంటూ వారిని జాగృతం చేశారు. ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చునని, పిరికితనం మనిషిని నిర్వీర్యం చేస్తే, ఆత్మవిశ్వాసం విజయతీరాల వైపు నడిపిస్తుందని సూచించారు. లక్ష్యసాధనలో అవరోధాలు ఎన్నో ఎదురవుతాయని, అయినా నిస్పృహ చెందకుండా అనుకున్న గమ్యం చేరే వరకు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బట్టి చదువులు నైపుణ్యాలు లేని వారిని తయారుచేసి నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. అంతర్జాలం, ఓటీటీలు, సినిమాల ప్రేరణతో యువత గాడీ తప్పుతోంది. మాదకద్రవ్యాల మత్తులో చిత్తవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నైతిక విలువలను పెంచి, మనోబలాన్ని, బుద్ధిని వికసింపజేసి, స్వశక్తిపై నమ్మకం పెంచే విద్య దేశానికి అత్యావశ్యకం. పైపై అలల్లా కాకుండా సముద్రమంత లోతుగా ఆలోచించాలని, భౌతికంగా, మానసికంగా బలహీనపరిచే దేనినైనా విషతుల్యంగా విడిచిపెట్టాలని డాక్టర్ సుధాకర్ హితబోధ చేస్తారు.

## స్వగ్రామానికి చేయూత..

డాక్టర్ సుధాకర్ పుట్టి పెరిగిన దమ్మన్నపేటకు అన్ని విధాలా చేయూతను అందించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన తన మూలాలు మరువకుండా గ్రామాభివృద్ధికి సహకరించారు. విద్యార్థులు, పాఠకుల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. స్కూల్ లో ఫర్నీచర్ తో పాటు మౌలిక వసతులు సమకూర్చారు. తాగునీటి కోసం గ్రామంలో బోర్లు వేయించారు. విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేశారు. యువతకు స్పోర్ట్స్ కిట్స్, పేదలకు దుప్పట్లు, నిత్యవసరాలు పంపిణీ చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు ఉచితంగా ఔషధాలు అందజేశారు. మెడికల్ సీట్ సాధించిన పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేశారు. పలు దైవ సేవా కార్యక్రమాల్లో తరచు పాల్గొంటున్న డాక్టర్ సుధాకర్ తన చెల్లెలు స్వర్గీయ సూర శ్రీలత పేరిట దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రతిఏటా అందజేస్తున్నారు.





## పురస్కారాలు..

నిగర్వి, కల్మషం లేని డాక్టర్ అప్పాల సుధాకర్ అనేక అవార్డులు, సత్కారాలు స్వీకరించారు. 2024లో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆయనను ఉత్తమ ప్రశంసా పత్రంతో సత్కరించారు. దేశ, విదేశాల్లో బెస్ట్ సర్జన్ గా పలు సన్మానాలు పొందారు. ఆయన శిష్యులు ఎంతోమంది ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు ఆయనకు ప్రతిభా పురస్కారాలు అందజేశాయి. ధనం, హోదా, పదవులు ముఖ్యం కాదని, అనురాగమైన స్నేహమే తీయని అనుబంధమని డాక్టర్ అప్పాల సుధాకర్ చెబుతారు.



# బ్యాగ్రౌండ్ లేకున్నా..

## తనదైన శైలిలో సినిమాలు...

సోషల్ మీడియాలో సినీతారల చిన్ననాటి ఫోటోస్ తెగ వైరలవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ చైల్డ్ హుడ్ పిక్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పైన ఫోటోలో తన తండ్రితో కలిసి ఉన్న చిన్నారి ఎవరో తెలుసా.. ? తెలుగు సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టి సహజ నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలోనూ కీలకపాత్ర పోషించింది. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా జీవించే అందమైన హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ అంజలి. ఏపీకి చెందిన ఈ అమ్మాయి.. జీవా నటించిన డేర్ సినిమాతో తెరంగేట్రం చేసింది. తర్వాత 2006లో ఫోటో సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. అయితే ఈ రెండు సినిమాలు అంజలికి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. కానీ తమిళంలో సూపర్ హిట్ అయిన షాపింగ్ మాల్ సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ చిత్రాన్ని తెలుగులో డబ్ చేయగా.. అదే స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ మురుగదాస్ తెరకెక్కించిన జర్నీ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ రెండు సినిమాలు అంజలి కెరీర్ మలుపు తిప్పాయి. 2013లో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో సీత పాత్రలో కనిపించింది. అంజలి.. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించింది. గ్లామర్ షోలు కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అలాగే లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటించి మెప్పించిన అంజలి.. ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీలో కీలకపాత్ర పోషించింది. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే.



## ఆ రెండు సినిమాల్లో నటించడం నా అదృష్టం : నిధిఅగర్వాల్

నిధీ అగర్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. సక్సెస్‌లు లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. ఇప్పటికే ఆమె రెండు భారీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన నటిస్తోంది. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. 2022లో గ్యాప్ తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. 'హరిహర వీరమల్లు' లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిని అని అనిపించింది. అలాగే హర్రర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం'' అని అన్నారు. సెట్‌లో విషయానికొస్తే.. పవన్ కల్యాణ్, ప్రభాస్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా పాత్రలోకి వెళ్లిపోతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. ఆ సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ప్రభాస్ ఫన్నీ పర్సన్. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆతురతగా ఎదురుచూస్తున్నా'' అని అన్నారు.




## నాకు దైవంతో సమానం



మెగాస్టార్ చిరంజీవి తనకు, తన కుటుంబానికి దైవంతో సమానం అని చెబుతోంది హీరోయిన్ ఊర్వశీ రౌతెల ఆయన మాకు ఏమీ కారు.. సినిమాలో నటించిన చిన్న పరిచయం అంతే. కానీ కష్టంలో ఎంతో అండగా నిలిచారు. అందుకే ఆయన్ను దైవంలా భావిస్తున్నామని, తమ బలానికి ఆయనొక లైట్‌హౌస్ లాంటివారని అంటోంది ఊర్వశీ. ఇంతకీ ఏం జరిగిందంటే. ఇటీవల ఊర్వశీ తల్లి మీను రౌతెల ఆస్పత్రి పాలైంది. ఆమె ఎడమ కాలిలో ఎముకలో ఇంట్రా ఆర్టిక్యూలర్ ఫ్రాక్చర్ అయింది. అదెంతో ప్రమాదకరమని వైద్యులు చెప్పగా ఊర్వశీ చిరంజీవిని సహాయం కోరింది. అందుకు స్పందించిన చిరంజీవి కోల్‌కత్తా అపోలో ఆస్పత్రి బృందంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చేశారు. డాక్టర్లు సర్జరీ చేయడంతో ఆమె ఆ సమస్య నుంచి గట్టెక్కింది. ఈ విషయమై తమ కుటుంబం చిరంజీవికి జీవిత కాలం రుణపడి ఉంటామని చెబుతోంది. ''చిరంజీవిగారి సేవా కార్యక్రమాల గురించి ఎంతో విన్నాను. 'వాల్తేరు వీరయ్య' సాంగ్ షూటింగ్‌లో నేను ఆయన్ను ఎంతో గమనించాను. ఆపద అన్నవారికి నేను చూస్తుండగానే ఎంతో సాయం అందించారు. ఆ సాయం నా వరకూ కూడా వచ్చింది. `

## ప్రభాస్‌తో కలిసి చేయడం ఆనందంగా ఉంది



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఆయన నటిస్తున్న 544వ చిత్రమిది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందంతోపాటు అనుపమ్‌ఖేర్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ''ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్ కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్ జయహో'' అని ట్వీట్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. దీనికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ''మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. 'సీతారామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు'' అని దర్శకుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు.

## అతడు నన్ను ఎంతో వేధించాడు ..



దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిరదని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

